# ఏకాకి నౌక చప్పుడు

ఆ రోజు తెల్లారకముందే లేచాడు సోమయాజులు. అతడు లేవడం చూసిన భార్య, కొడుకు ఒక్కసారి కళ్లు తెరిచి మళ్ళీ పడుకున్నారు. మూడేళ్ళుగా ఆ రోజు అతడు చేసేదేమిటో వారికి తెలుసు. అందుకే కళ్ళు తెరిచినవాళ్లు మళ్ళీ నిద్రలోకి జారుకున్నారు. వారి నిద్ర పాడుచెయ్యడం ఇష్టంలేక నిశ్శబ్దంగా తనపని తానుచేసుకుంటున్నాడు సోమయాజులు.

స్టౌ వెలిగించి నీళ్ళు పెట్టుకున్నాడు. నీళ్ళు కాగేలోపు షేవింగు, ఇతర కార్యక్రమాలు పూర్తి చేసాడు. ఆ తర్వాత షాంపూతో తలస్నానం చేశాడు. కొత్తబట్టలు తొడుక్కున్నాడు. దేవుడిగదిలోకి వెళ్ళి దీపంపెట్టి కాసేపు కళ్ళు మూసుకునివచ్చాడు. అంతకు ముందురోజు కొన్న స్వీట్లు, పువ్వులు, కేండిల్సు, సంచిలో సర్దుకున్నాడు.

బయటకు వస్తూ "వెళ్ళొస్తా!" అన్నాడు సోమయాజులు.

నిద్ర కళ్ళతో లేచిన భార్య "జాగ్రత్తగా వెళ్ళిరండి. కుర్రాడిని తీసుకు వెళ్ళరాదూ!" అంది.

"వద్దులే! వాడిని పడుకోనీ" అంటూ గబగబా బైటకొచ్చి గేటుతీసి స్కూటర్ స్టార్ట్ చేసాడు.

తన వీధి మలుపుదాటి హైవేరోడ్డుమీదకు వచ్చాడు. వాన కురిసి వెలిసింది. రోడ్డు చెమ్మగా వుంది. హైవేరోడ్డుకి రెండువైపులా పచ్చటి ఆకులతో వున్న చెట్లు. అవి వానచినుకులతో తడిసి ఆ ప్రదేశం గుబాళిస్తోంది. ఆకాశంలో మిణుకుమంటున్న నక్షత్రాలు. చల్లగావున్న ఆ వాతావరణంలో బండి నెమ్మదిగా నడుపుతున్నాడు. హైవేరోడ్డు దాటి తను వెళ్ళవలసిన ఊరుకు తిరిగే అడ్డరోడ్డువైపు స్కూటర్‌ను మళ్ళించాడు. అప్పటికి వాహనాల రాక పోకలు మొదలయ్యాయి. గంటప్రయాణం తర్వాత తను చేరవలసిన ఊరు

వచ్చింది. వంతెన మీదుగా వెళుతూ ఆ ఊరికి దారితీసే మట్టిరోడ్డు వైపు స్కూటర్‌ను తిప్పాడు. ఫర్లాంగుదూరం ఆ తర్వాత తను చేరవలసిన గమ్య స్థానంవైపు స్కూటర్ మలుపు తిరిగింది. రెండునిమిషాలకు ఆ ఆవరణకు చేరుకున్నాడు.

స్కూటర్ బయట పార్క్‌చేసి లోపలకు నడిచాడు. అతడి ముందు వరుసగా బారులు తీర్చినట్లు నడుస్తూ, పాడుతూ వెళుతున్నారు తెల్లటిబట్టలు ధరించిన నన్‌లు, వారు పాడుతున్న భక్తిగీతం శ్రావ్యంగా వినిపించింది సోమయాజులుకి, తను వారితో పదం కలిపాడు. వారంతా వెళ్ళిన ఆ సమాధుల ప్రాంగణంలోకి అడుగుపెట్టిన సోమయాజులు మనసులో ఎంతో ఉద్వేగం, దానితోపాటూ మాటల్లో చెప్పలేని సంతోషం విశాలమైన ఆ సమాధుల ఆవరణ రంగురంగుల దీపాలతో పట్టపగలులా అనిపిస్తోంది. సోమయాజులు కళ్ళు ఆతృతగా తనకు కావలసిన సమాధికోసం వెదుకు తున్నాయి.

అప్పటికే చాలామంది ఆ సమాధుల దగ్గరకుచేరారు. తమ తమ సంబంధీకుల సమాధులపై పూలు చల్లుతున్నారు. కేండిల్సు వెలిగిస్తున్నారు. భక్తితో మోకరిల్లి చనిపోయిన తమ ఆత్మీయులకు నివాళులు అర్పిస్తున్నారు. సోమయాజులు ఒక్కో సమాధి చూసుకుంటూ మెల్లగా వెళుతున్నాడు. సమాధులు కొన్ని సిమ్మెంటుతో చేసినవి. మరికొన్ని పాలరాతితో కట్టినవి. ఆ దీపాల వెలుగులో మెరుస్తున్నాయి. కొన్ని మట్టివీ వున్నాయి. 'ఇక్కడ కూడా ధనిక, పేద తరగతుల తారతమ్యాలు కనిపిస్తున్నాయి' అనుకున్నాడు సోమయాజులు.

నడుస్తున్న సోమయాజులుకి చిన్నగా మూడేసి అడుగులున్న సమాధులు కనిపించాయి. 'పాపం చిన్నపిల్లలవి, ఇంకా లోకం చూడని పసి వాళ్ళు పరమాత్మలో ఐక్యం అయ్యారు' అనుకున్నాడు. ఆ సమయంలో అతడికి గుఱ్ఱం జాషువాగారి పద్యం గుర్తుకొచ్చింది.

'ఎన్నో ఏండ్లు గతించినవిగాని, ఈ శ్మశానస్థలిన్ కన్నులు మూసిన మంద భాగ్యుడొక్కడైనను లేచి రాడక్కటా?'

ఆ పద్యం పాడుకుంటూ వెళుతున్న సోమయాజులు టక్కున ఆగిపోయాడు తను వెతుకుతున్న సమాధి కనిపించేసరికి.

- మల్లెల అబ్రహామ్
సన్నాఫ్ డేనియల్
జననం : 19-4-1940
మరణం : 30-1-2003

గబగబా సంచీలోంచి తను తెచ్చిన గుడ్డతీసి ఆ సమాధి తుడిచాడు. తను తెచ్చిన పువ్వుల్ని ఆ సమాధిపై చల్లుతూ నమస్కరించాడు. కేండిల్సు వెలిగించి సమాధిపై ఉంచాడు. ఒక్కొక్కటీ వెలిగిస్తుంటే అవి అరిపోతున్నాయి. ఇద్దరు వచ్చి అతనికి సాయం చేశారు. ఆ ఇద్దరిలో ఒకరు సోమయాజులు వంక పరిశీలనగా చూసి "అబ్రహామ్ కొడుకులూ, కూతురూ హైదరాబాదులో ఉంటున్నారు. ఈ సంవత్సరం ఎవరూ రాలేదు, పాపం మీరు శ్రమపడి వస్తున్నారు. ఎవరూ రాకపోతే ఈ ఆత్మలు ఎంత క్షోభిస్తాయో" అంటూ నిట్టూర్చాడు అతను.

ఆ మాటలకు ఉద్వేగానికి లోనైన సోమయాజులు తనలో తాను అనుకున్నాడు. "అబ్రహామ్ అనే వ్యక్తితో తనకు పరిచయం లేదు. ఆయనను ఎప్పుడు కలవలేదు, చనిపోయినప్పటి పార్థివశరీరాన్ని చూడలేదు. అసలు ఆయన ఎలా వుంటాడో కూడా తనకు తెలీదు. అయినా ప్రతీ సంవత్సరం అబ్రహామ్ సమాధిని దర్శించుకుంటున్నాడు. అలా వచ్చినప్పుడల్లా ఉత్సాహం, అనిర్వచనీయమైన ఆత్మానందం ఏకకాలంలో పొందుతాడు.

వాటికి కారణమైన మూడు సంవత్సరాల క్రిందట జరిగిన ఆ సంఘటన గుర్తుకొచ్చి ఆ జ్ఞాపకాల బరువుతో గతంలోకి జారిపోయాడు సోమయాజులు.

* * *

ఆ రోజు ఉదయమే ఆ ఊరు బయలుదేరాడు స్కూటర్ మీద విశాఖ పట్నం నించి యాభై కిలోమీటర్ల దూరంలో వున్న ఆ పల్లెటూరుకు. అక్కడ తనకు తాతల కాలం నాటి పాత పెంకుటిల్లు ఉంది. అది తనకు తెలిసిన వారికి అమ్మేసాడు. వారు తొలి విడతగా ఇచ్చిన లక్షరూపాయలు డబ్బు తీసుకుని బయలుదేరేసరికి సాయంత్రం అయిపోయింది. మెల్లగా చినుకులు మొదలయ్యాయి. అలవాటైన ప్రదేశం కాబట్టి గంటలో పని చూసుకుని తిరిగి వెళ్ళిపోదామనుకున్నాడు. అయితే మధ్య దారిలో ఆ చినుకులు పెద్దవై మెల్లగా వర్షరూపం దాల్చాయి. అప్పటికే ఆ ఊరుదాటి హైవే రోడ్డుమీదకొచ్చాడు. సాయం సంధ్య వీడిపోయి పల్చగా చీకటి తెరలు వ్యాపిస్తున్నాయి. అంత వరకు ధైర్యంగా వున్న సోమయాజులులో భయం నీడలు.

నెల్లాళ్ళలో అతడి కూతురుపెళ్ళి కట్నంలేకుండా ఆమెను చేసు కుంటున్న సాఫ్ట్‌వేర్ కుర్రాడు అమెరికా వెళ్ళడానికి ఖర్చులకోసం లక్షల రూపాయలు తనే ఇస్తానవి మాటిచ్చాడు. ఇపుడు ఈ చీకటి ఒంటరిరాత్రిలో తను సురక్షితంగా ఆ డబ్బు ఇంటికి చేర్చగలడా? అనే భయం. ఇంకొక భయం తన ఆరోగ్యం గురించి. అది అంతంత మాత్రం. వంశానుగతంగా సంక్రమించిన ఉబ్బసం. ఎపుడూ తన దగ్గర ఉంచుకునే ఇన్‌హేలర్ మరిచి పోయాడు. ఆ చీకటితోపాటు వెన్నులో వణుకుపుట్టిస్తున్న చలి. తనకు స్ట్రోక్ వస్తుందనే భయం ఎక్కువయింది.

ఎక్కడా నరసంచారం లేని ఆ హైవేరోడ్డు మీద తడుస్తున్న సోమయాజులుకు ఒక్కసారి శరీరంలోని నవనాడులు కంపించినట్టయింది. ఈ చలికి తనకు ఉబ్బసం వచ్చి ఊపిరాడక చావు దగ్గరకొస్తుందేమో అని భయపడుతూనే ముందుకు వెళుతున్నాడు సోమయాజులు. 'తనకిప్పుడు ధైర్యం కావాలి. ఈ చీకటి రాత్రి ఒక తోడుకావాలి. అలా అనుకుంటూనే కొండమీద కట్టిన ఒక డాబా ఇల్లు చూసాడు సోమయాజులు.

ఆ ఇంటి ముందున్న కార్‌షెడ్ క్రింద స్కూటర్ పార్క్‌చేసి అక్కడే

కూలబడ్డాడు. 'వర్షం నించి రక్షణ దొరికింది. మరి ఒంటరితనం... భయ పెడుతున్న చీకటి!... తన దగ్గరున్న డబ్బు ఎవరైనా కొట్టేసిపోతే, కూతురి పెళ్ళి ఆగిపోతే! అసలు తను ఈ చీకటి రాత్రి బ్రతికి బట్టకట్టగలడా? అతడి గుండె వేగం పెరిగింది, రకరకాల ఆలోచనలతో భయం మరీ ఎక్కువైంది.

"అయ్యా, నేను దారిన వెళుతూ వర్షానికి ఆగిపోయాను, అంతా చీకటి, ఒక్కసారి తలుపు తెరవగలరా?" - గట్టిగా భయంతో అరిచాడు సోమయాజులు.

అతడి అరుపుకి సమాధానం లేదు.

'ఔను, తన పిచ్చిగానీ ఈ చీకటి రాత్రి ఎవరో ఆగంతకుడు పిలిస్తే తలుపు తియ్యడానికి లోపలున్న వారెవరయినా వెర్రివాళ్ళా!'

ఇంతలో అతడికి ఆ ఇంట్లోంచి ఒక చిన్న శబ్దం వినిపించింది.

ఔను లోపల ఎవరో దగ్గుతున్నారు. ఆ శబ్ధమే తనకు వినిపించింది.'

'అమ్మయ్య లోపల ఎవరో ఉన్నారు... బ్రతికాను' అనుకున్నాడు. లోపలి నుంచి ఇంకో నిమిషానికి మళ్ళీ దగ్గుతున్న శబ్దం వినిపించింది. అది తెరలు తెరలుగా వచ్చింది.

ఆ దగ్గు విన్న సోమయాజులికి పోయిన ప్రాణం తిరిగి వచ్చి నట్టయింది. ఆ ఒంటరి నిశిరాత్రిలో ఆ దగ్గు అతడికి ఒక వ్యక్తి తనకు తోడున్నాడనే ఊరట కలిగించింది. అలా ధైర్యం కూడగట్టుకుని ప్రశాంతంగా తను కూర్చున్న చోటనే కళ్ళు మూసుకుని జోగుతున్నాడు సోమయాజులు. నిద్రముంచుకొచ్చి కళ్లు మూతలుపడుతుంటే నిమిషం విరామంతో వినిపించే ఆ దగ్గు అతడిని నిద్ర నించి లేపేది. నిద్రపోతే డబ్బులు ఎవరైనా తీసుకు పోతారనే భయం, అలా అతడిని పూర్తిగా నిద్రపోనీయకుండా ఆ అపరిచితుడి దగ్గు కాపాడింది. అలా కూర్చునే మధ్య మధ్యలో కునుకు తీస్తూ వుండేసరికి

తెల్లారిపోయింది. వర్షంపూర్తిగా తగ్గి పోయింది. ఒక్కసారి లేచి ఒళ్లు విరుచు కున్నాడు సోమయాజులు.

'భూమ్మీద తనకు ఇంకా నూకలున్నాయి. భోరున వర్షం, నరాలు తెగకొట్టే చలికితోడు భయం కలిగించే చీకటి. వీటితో తన ప్రాణాలే కాదు కూతురి పెళ్ళి కోసం సమకూర్చుకున్న డబ్బూపోతుందని భయపడినా ఒక వ్యక్తి తోడున్నాడని ధైర్యంతో రాత్రంతా భయం లేకుండా గడిపాడు. లోపలున్న ఆ వ్యక్తికి ఈ విషయం తెలీదు. తెలీకుండానే తనకు సహాయం చేసాడు, ఆ అజ్ఞాత వ్యక్తికి కృతజ్ఞతలు చెప్పాలనిపించింది సోమయాజులుకు.

"అయ్యా, రాత్రంతా మీ ఇంటి వసారాలో తలదాచుకున్నాను, కృతజ్ఞుణ్ణి" అంటూ అరిచాడు.

లోపల్నించి ఏ స్పందనా లేదు. 'పాపం' రాత్రంతా దగ్గుతో బాధపడి, తెల్లారిన తర్వాతే నిద్రపోయి ఉంటాడు. 'ఈసారొచ్చినపుడు కలుస్తాను నేస్తం! నిన్ను' అనుకొని తన స్కూటర్ స్టార్ట్ చేసి ఇంటిముఖం పట్టాడు.

ఆ తర్వాత నెలరోజులవరకూ అతడికి తీరికలేదు. కూతురిపెళ్ళి, ఆమెను అల్లుడితో పాటు అమెరికా పంపడం ఇలా పూర్తిగా పనులతో తలమునక లయిపోయాడు.

నెలరోజుల తర్వాత మళ్ళీ అదే దారిలో స్కూటర్ మీద ప్రయాణం. తను ఆత్మబంధువుగా భావించే ఆ అజ్ఞాతవ్యక్తిని చూద్దామని ఆ ఇంటిదగ్గర ఆగేడు.

ఇంటికి తాళం వేసుంది. చాలాసేపు అక్కడే నుంచున్నాడు.

ఆ దారిన వెళుతున్న ఒక వ్యక్తి సోమయాజులు వంక చూసి "ఎవరు కావాలి?" అనడిగాడు.

"ఇంట్లో ఎవరూ లేరా?" అన్నాడు సోమయాజులు.

"తెలీదా మీకు!" అన్నాడు ఆ వ్యక్తి సోమయాజుల్ని నిశితంగా చూసి.

“ఏమయ్యింది?” అన్నాడు అశ్చర్యంగా సోమయాజులు.

“అబ్రహామ్‌గారు పోయారు. పోయి నెలయ్యింది. భార్య చాలాకాలం క్రితమే పోయింది. పాపం ఒక్కడే ఉంటాడు ఈ ఇంట్లో. కొడుకులు, కూతురూ ఉండేది హైదరాబాదులో దగ్గేతినేసింది అతగాడిని, ఆ రోజు రాత్రంతా దగ్గాడట!”

ఆ వ్యక్తి మాటలతో సోమయాజులు ఒంట్లో నరాలన్నీ తెగిన ఫీలింగ్.

ఆ దగ్గే తనకు ధైర్యాన్నిచ్చింది. అతడిని మాత్రం మృత్యుకుహరంలోకి నెట్టింది. తన ప్రాణదాతను. ఆ చీకటిరాత్రి తనకు తోడుగా వున్న ఆ ఆత్మబంధువును, ఒక్కసారి చూద్దామనుకున్నాడు. ఇక చూసేదారిలేదు.

అలా మథనపడుతున్న సోమయాజులు బాధను ఆ వ్యక్తికి అర్థం చేసుకున్నాడు కాబోలు వెంటనే అన్నాడు.

“పోయినవాళ్లు తిరిగిరారు. ఇంకో రెండు రోజుల్లో సమాధుల పండగ జరుగుతుంది. అబ్రహామ్‌గారి కూతురు కొడుకులు వస్తారు, మీరు రండి. ఈ ఊరు చివరన కట్టిన కొత్తవంతెన దిగువనే ఉంది సమాధుల ఆవరణ. మీరు వస్తే అబ్రహాంగారి ఆత్మశాంతిస్తుంది” అన్నాడా వ్యక్తి.

అలా తను భౌతికంగా చూడకపోయినా చనిపోయిన తర్వాత అబ్రహామ్ సమాధిని దర్శించాడు ఆ సమాధుల పండగరోజున.

* * *

ఆలోచనల్లో ఉన్న సోమయాజులు ఆ ఆవరణలోకి ఫాదర్ రావడం పాటపాడి ప్రార్థన ముగించడం గమనించలేదు. అంతలో అతనికి ఎదురుగా అంతవరకూ నఖశిఖపర్యంతం పరిశీలించిన ఒక వ్యక్తి

“ఇప్పటికి అబ్రహామ్ చనిపోయి మూడేళ్ళయింది. మొదటి సారి సమాధుల పండగరోజున అతడి కూతురు కొడుకులు వచ్చారు. రెండో

సంవత్సరం కూతురు మాత్రం వచ్చింది. ఇది మూడో సంవత్సరం వాళ్ళెవరూ. రాలేదు. మీరు మాత్రం మూడేళ్ళుగా ప్రతీ సంవత్సరం వస్తున్నారు'' అన్నాడు.

ఆ వ్యక్తి మాటలకు సమాధానం చెప్పకుండా నవ్వి ఊరుకుని, మనసులో మాత్రం. 'ఔను, తను ఈ శ్వాస తుదివరకూ అబ్రహామ్ సమాధిని దర్శిస్తూనే ఉంటాడు. ఆ రోజు తనకు పుట్టినరోజు పండగ జీవితంలో ఎప్పుడూ పుట్టినరోజు చేసుకోలేదు. కానీ సమాధుల పండగరోజున, అబ్రహామ్‌కి నివాళు లు అర్పించే రోజున తను క్రొత్తబట్టలు తొడుక్కొని వస్తాడు. సంవత్సరంలో ఒకసారి వచ్చే ఈ రోజు కోసం సంవత్సరమంతా ఆతృతగా ఎదురుచూస్తాడు.

ఆలోచనల్లోంచి బైటకొచ్చి, తను తెచ్చిన స్వీట్లపాకెట్టు తెరిచాడు. అక్కడున్న వారందరికీ పంచాడు. పావుగంటలో ఆ ఆవరణ ఖాళీ అయిపోయింది.

ఆ ఆవరణ మొత్తానికి సోమయాజులు ఒక్కడే మిగిలాడు. అతడికి మరికొంతసేపు అక్కడే వుండాలనిపించింది. అబ్రహామ్ సమాధిమీద అతడు చనిపోయిన తేదీ చూసాడు. అది 30.1.2003. అది, ఆ చీకటివర్షపురాత్రి తను అబ్రహామ్ ఇంటి ముందు తలదాచుకున్న రోజు. సోమయాజులులో మళ్ళీ ఏదో ఉద్వేగం, తీరందాటి వెళుతున్న ఏకాకి నౌక చప్పుడులా అతడికి వినిపించింది. అతడి గుండెచప్పుడు - మళ్ళీ ప్రశాంతంగా మారి ఆ సమాధి వైపు తిరిగి మరోసారి నమస్కరించి వెను తిరిగాడు. అలా ముందుకు నడుస్తున్న సోమయాజుల్ని ఇందాకట్నుంటీ పరిశీలించిన ఆ వ్యక్తి అడిగేడు.... ''అబ్రహామ్ మీకు బంధువా?'' అని.

'ఔను... ఆయన నాకు 'ఆత్మ' బంధువు అనుకుంటూ ముందుకు సాగిపోయాడు సోమయాజులు, వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ.

*(26-5-2008 జాగృతి వార పత్రిక)*